'భట్రాజులు'

[కథానిక]

శ్రీ కందుకూరి లింగరాజు

సుందరిని ఎల్లా మార్చడమా అన్నది పెద్ద సమస్య అయిపోయింది రాజాకి. పెళ్లి అయినప్పటినుండీ చూస్తూనే వున్నాడు, అదే వరస. మారుతుందేమో అని కొన్నాళ్ళు ఎదురుచూచేడు; కాని అనుకున్న మార్పు రానేలేదు. ఎదురుచూచిన ఆనకట్టు కట్టబడనేలేదు.

రోజులు గడిచేటప్పటికి ఇది చాలా బాధించే విషయంగా తయారై కూర్చుంది. ఒక్క దాన్లోనే కాదు, ప్రతీ చిన్న విషయందగ్గరనుండి అదే వరస, అదే వావి.

మొదట్లో తను సంసారం అంటే ఇల్లాంటి భావన అని వూహించుకోనందుకు తిట్టుకున్నాడు. తను అన్ని కోణాల్లోనూ వూహించి నిర్ణీతంగా, సమానస్థాయిదాలో ఒకళ్ళ కొకళ్ళు త్యాగం చేస్తే, శకటం ఏ ఇసుకల్లోనూ పడకుండానే నడుస్తుం దనుకున్నాడు. కొంచెం కష్టమయిన పరిస్థితులు ఆవృతంఅయినా త్యాగం చెయ్యడం నేర్చుకున్నాడు.

ఇప్పుడు సుందరివరస చూస్తే ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తనేమైనా మారితే? ఈ ప్రశ్న చాలా సార్లు వచ్చింది. ఇల్లాంటి విషయంలో, అందులోనూ భార్యాభర్తల మధ్య అది నీచంగా కన్పించేట్టుగానే వుంది.

వచ్చినప్పటినుంచీ ప్రారంభించింది. "మీరు చాలా తెలివైనవారు, కవులు, చదువుకున్నవారు, అనుభవజ్ఞులు" అంటూ చదవడమే. కాఫీ త్రాగడం దగ్గరనుండి ఆఖరికి మంచంమీద నిద్రపోయేవరకూ— సందర్భం వుండనివ్వండి, లేకపోనీండి—ఇది చదివెయ్యడమే!

కొన్ని సమయాల్లో చాలా చిరాకు అనిపించేది రాజాకి. కొన్నిటల్లో కోపం వచ్చేది. కొన్ని సందర్భాలలో నవ్వు కలిగించేది. ఎల్లాటి సమయానుకూల అరిషడ్వర్గాలు వచ్చినా అతనికి న్యూనతగానే వుండేది. తన పెళ్ళాం తనను భట్రాజులా పొగడ్డం చూస్తుంటే తల తీసేసినట్టే అయ్యేది.

చాలాసార్లు ఆక్షేపించేడు. అయినా సుందరి మారనే లేదు. తను భరించలేకనే, అనుకుని, కట్టుకున్న సౌధాలన్నీ నేలమట్టమైపోతున్నాయి దూర్వాసత్వంలో. ఏవిధంగా తను మారాలో తెలియటం లేదు. ఏవిధంగా, అనునయంగా, విరక్తిలో, కోపంలో, లాలింపులో వ్యవహరిస్తే అది మానుతుందా అన్నది సమస్యే అయింది.

స్నేహితు ణ్ణెవర్నయినా సలహా నడిగా మనుకుని, ఓరోజు బయల్దేరేడు. దారిలో, సగందూరము వెళ్ళేటప్పటికి, ఈ స్వవిషయాలు శాస్త్రిలోనూ, గోపీతోనూ—ఎంత స్నేహితులైనా—ఎల్లా మాట్లాడుతా ననుకున్నాడు. ఓవిధమైన న్యూనత కలిగింది. తను లింపుతోనే ఆలోచన తెగక ఇంటికి వచ్చేడు.

దారిలో, సుందర్రామయ్య కనిపించేడు. "ఏరా! అల్లా వున్నావ్?" అని నిలవతీసినట్టే అడిగేడు. ఏం చెప్పడానికీ తోచనేలేదు. చెపుదామా, ఏమైనా ఆలోచన చెపుతాడేమో అని లోపలున్న గుబగుబ నాలికచివరివరకూ వచ్చింది; అయినా సంశయించి, ఏదో లోకాభిరామాయణంతో తన అడ్డరోడ్డుదగ్గర విడిపోయేడు.

వస్తుంటే, రోజూ కనపడి నవ్వుమొఖంతో అడిగే పువ్వులసాయిబు "బాబూ, పువ్వు లిమ్మంటారా?" అన్నాడు. తీసుకువెళితే సుందరి ఓవిధంగా తనకు వెగటు కలిగించే మార్గంలో మాట్లాడుతుంది. దానికి తాను తట్టుకోలేడు. 'అక్కర్లే'దని చెప్పేడు.

సగందూరం వచ్చేసేక ఎందుకో పువ్వులు తీసుకో నందుకు హృదయం గుబగుబలాడింది.

దారిలో వస్తుంటే ప్రక్కవాళ్ళ కిటికీలోంచి లోపలికి చూచేడు. "రాణీ! నువ్వు ఎంత అందంగా ఉన్నా వనుకున్నావ్! నిన్ను చూడ్డానికి వచ్చినపుడు ఏమైనా మందు జల్లేవా?......" ఆ వరసలో మాటలు వినిపించేయి.

ఒక్కసారిగా అవి ఏదో క్రొత్తగా కిటికీ తెరచినట్టే అయింది రాజాకి. తనూ ఇకనుండి సుందర్ని ఈవిధంగా భర్త్రాజత్వం ప్రారంభిస్తే...... సబబుగానే వున్నట్టే వుంది. కొన్నాళ్ళకి ఆవిడకి విసుగెత్తి...మానేస్తుందేమో...

ఆలోచనలు చుట్టుకుంటుంటే అడుగులు జోరుగానే వేసి గుమ్మం ఎక్కేడు. జోళ్ళు విడిచినపుడు "ఎల్లా ప్రారంభం చెయ్యనూ?" అన్న సంశయం వుములుకుని కొంత తచ్చాటపడ్డాడు.

భోజనానికి కూర్చున్నాడు. మల్లెపువ్వులు తెచ్చివుంటే సమవుజ్జీగా సమరం ప్రారంభింపబడి వుండేదే అనుకున్నాడు. కందిపప్పుపచ్చడి, ఉల్లిపాయలపులుసు, చేదుచేదుగా వున్న క్రొత్తఆవకాయ.

"పచ్చడిలో ఆ రవ్వంత ఇంగువతోనూ ఎంత కమ్మదనం వచ్చిం దనుకున్నావ్!" కనుకొలుకుల్లోంచి చూస్తూనే, 'ముఖకవళికలు ఎల్లా వున్నాయ్? తన ప్రారంభం అనుమానం తగలకుండా వుందా?' అని చూచేడు. సుందరికళ్లు ఓసారి మెరిసి "ఏం పొగుడుతారు లెద్దురూ" అనేసింది.

రాజాకి ఆ ముక్కలు కోటలో పాగా వేసినట్టే అయింది. ఆరోజున నెమ్మదినెమ్మదిగా, తన అలవాటులో వున్న కవిత్వంతో అన్నిపదార్థాలనూ, ఆఖరుకు కొంతిపొడి, కరివేపాకు, నిమ్మరసము వేసిన మజ్జిగతోసహా పొగిడేసేడు.

ఆరోజురాత్రి తను వస్తుంటే కిటికీలోనుండి విన్న ముక్కలను చెవులో సమయానుకూలంగా వూదేస్తే, సుందరి సెమిలే అయిపోయింది. రోజూ రాత్రి ఏదో సందర్భంలో తనను పొగడ్డం ప్రారంభించే సుందరి, అది మరచిపోయి మురిసిపోవడం చూచి, గుండెలమీద చేతులు వేసుకుని సుఖంగా నిద్రపోయేడు.

మర్నాడు అప్పుడప్పుడు తన నూత్నపాతం అమల్లో పెట్టడంతో సాఫీగా గడచిపోయింది. అనుకున్న మార్పు రావడంతో వెన్నెల కమ్ముకున్నట్టే అయింది. ఆరాత్రివేళ ఆ దంపతులకు—తన గురువులకు ఏ ఈనాం అయినా పట్టుకువెళ్ళి ఇద్దామన్నంత సంతోషం కలిగింది.

రెండు రోజులు క్రమేణా అలవాటులో పడ్డాయి. ఆరోజుల్లో ఒకటే అరా సమయంలో సుందరి కొంత పాతరస్తాలో పడ్డా వెనక్కి నెట్టేసుకుని, రాజా వేసిన ఉచ్చుల్లో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

రాజా ఈ మార్పు ఇంత త్వరితంలో వస్తుందని అనుకోలేదు. తను బాగా పురాణం ప్రారంభిస్తే అసలు తగ్గిపోతుందికదా అన్న తలంపులు చిమ్ముకోవడంతో, ప్రొద్దుటే లేచినదగ్గరనుంచి రాత్రివరకూ, ప్రతి విషయంలోనూ తన పాఠం వల్లించడం మొదలుపెట్టేసరికి, సుందరికి దారీ తెన్నూ తెలిసింది కాదు.

ఇదివరకటి రోజుల్లో రాజా ఇల్లా ఎప్పుడూ మాట్లాడేవాడే కాడు. ఆ మొదటి రోజుల్లో తప్ప మొఖం ఎప్పుడూ ధుమధుమలాడుతూ... ఏదో మొఖం ఎప్పుడూ ధుమారింపుగానే వుండేది. ఏదో న్యూనత పడ్డట్టే వుండేవాడు. న్యూనత...

ఈ రోజుల్లో తనకే ఓవిధంగా న్యూనత పొందుతున్నట్లు అనుమానం తట్టింది. తన భర్త తనను పొగడ్డంలో, అందులోనూ కుంపటి అంటించడందగ్గర నుండి పొయ్యి అలికేవరకూ కూడాను. తను నడిస్తే హంసలు నడిచినట్టు వుందట. నవ్వితే మాణిక్యాలే రాలేటట్టు వుందట. కాఫీ అమృతంలా కాస్తున్నానట. కూరలూ అవీ నలభీమపాకమేనట!

వింతగానే వుంది. అంతగా పొగడ్తా వేళాకోళం చెయ్యడమేమో అని ఒకటి రెండుసార్లు ఊహించుకుంది. ఆయన మాటలు మొదటి రెండుమూడు రోజులూ కొంచెం ఆనందాన్ని, గర్వాన్ని కలిగింపజేసేయి కాని ఇప్పుడు మాత్రం బాధపెడుతున్నై.

ఎంచేత తన రాజా ఇల్లా మారేడా అని ఆలోచించడం ప్రారంభిస్తే అంతూ పొంతూ చిక్కలేదు. తనేమైనా తన పుట్టింటివారు గొప్పవారు, డబ్బున్నవారు అన్న అతిశయంలో మాట్లాడేనా? దాని పరిణామమా? అని సింహావలోకనం చేసుకుంది; కాని అది నిరుకైన కారణంలా కన్పించనేలేదు. ఆఖరుకి ఇదివరకటిలా వాళ్ళమ్మగారు వ్రాసిన ఉత్తరాలు పెట్టెలో, చూపించ

కుండా పెట్టడంకూడా మానేసి, ముందరే ఆయనకు ఇస్తోంది. మరి...?

అవ్వాళ రాజా మల్లెపూలు ఒక్కటే కాకుండా, ఏవో తినుబండారాలు హైదరాబాద్ స్వీట్ స్టాల్సులో కొని తీసుకువచ్చేడు. పువ్వులు జడలో తురుముకునేప్పుడే "రాణీ! ఎంత అందంగా వున్నావనుకున్నావ్! రంభ, తిలోత్తమ, మేనక... కాంచనమాల, కన్నాంబ...వీళ్ళంతా నీ కాలిగోటికైనా సరిపోరు..." అతను మొదలుపెట్టేడు.

ఇంతగా ఎప్పుడూ గతించిన రోజుల్లో సన్నివేశం శృతిమించలేదు. చెయ్యి పువ్వుల్లో వణికింది. హృదయం ఒక్కసారి ఆగిపోయినట్టే వుంది—ఏం చేతనో? తల్లో పెట్టినవి సరిగ్గా సరిచేసుకోలేకపోయింది.

అనుమానం కొంచెం వెన్నెముకకు పూసుకుంటే సుందరి నవ్వలేకపోయింది. ఇదివరకు ఈ భట్రాజత్వాన్ని సుముఖంగా, యాదాలాపంగానే తీసుకుంది. ఈనాడు అది అతీతం అయింది. అందులో న్యూనత, కుమిలింపు కన్పిస్తే ముడుచుకుపోయి ఆలోచించడం ప్రారంభించింది.

"నిజంగా నువ్వు ఆ చెయ్యి వెనక్కి తిప్పినప్పుడే, అజంతా, ఎల్లోరాల్లో చెయితిరిగిన కళాకారుడు చెక్కిన భంగిమలా వుంది......"

ఉండేలుదెబ్బ తగిలినట్టుగా తగిలింది. అల్లాగే బాధతో కళ్ళప్పగించి ఓలా అయింది. ఇది చూచేటప్పటికి రాజాకి అరికాళ్ళు మంటలెక్కినట్టయింది. తను దేనిని ఉపయోగించుకుని ఇన్నిరోజులూ రక్షణ పొందేడో అది పగిలిపోయింది. నాలిక్కరచుకున్నాడు అతిగా వెళ్ళినందుకు; అయినా తరణోపాయం ఎవర్ని అడగాలో తెలియనటువంటి శూన్యం అయింది.

సుందరికి కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి—తను ఊహించుకుని ప్రేమించిన భర్త తన్నే ఇల్లా న్యూనతపరచి మాటలంటాడని. వాటిల్లో పెడర్థాలు ఎన్నో కనిపించేయి...ఆ గద్గదకంఠంతోనే "ఏమండీ, నేనేం చేసేనని ఇల్లా ఏడిపిస్తారు?" దగ్గిరసా వచ్చింది.

ఇంత విచిత్ర సన్నివేశంలో పడతానని రాజా ఎప్పుడూ అనుకోలేదు. తను ఆశించిన అంతానికి సమయం రాలేదన్న తలంపులోనే ఉండిపోవడంవల్ల ఆశ్చర్యం తలెత్తుకోనివ్వకుండా, తప్పిదం చేసి క్షమాపణ ఇచ్చేట్టే చేసింది. నెమ్మదిగా తన తువ్వాలుతో కళ్ళు తుడుస్తూనే అనునయంగా, మౌనంలో మునిగిపోయేడు.

"మిమ్మల్ని ఏమన్నానని, గతవారంనుండి అల్లా మొదలెట్టేరు? నాకు ఉరేసుకున్నట్టే అవుతోంది. అందులోనూ మీరు..."

తన కారణం చెప్పేసి తుని తగవు చేసుకుందామంటే ధైర్యం చాలీ చాలనట్టయితే "నువ్వుమాత్రం..." ఈ ముక్కలు ఎల్లాగో అనగలిగేడు.

"నేనా?"

తెలూపేడు. "కాపురానికి వచ్చినప్పటినుండి నువ్వుమాత్రం...నా మట్టుకు నేనెంతగా బాధపడ్డానో..." ఈ వరసలో తుదా మొదలూ కూడా చెప్పుదామనుకున్నాడు. ఆ సమయంలో మాటలు కరువయ్యేయి.

అతను మూగగా వుండిపోవడంలోని బాధ సుందరికి క్షణికంగా తను మొదటిరోజుల్లో ఆయన్ని భట్రాజత్వం చేసిన అంశాలు జ్ఞాపకం చేస్తే ముడుచుకుపోయింది. తనను ఆ మార్గంలోనుంచి మార్చడానికే...ఈ వ్యూహ సమంజసంగానే తట్టింది.

"నేను అంటున్నానని...మీరూ..." జబ్బలు పట్టుకుని ఊపినట్టుగానే అంది. దీంతో తల్లక్రిందులే అయ్యేడు రాజా. "నీవు నేర్పిన..." ఆ పద్యం జ్ఞాపకం వచ్చింది. ఏంచేతో నోటమ్మట మాట రానేలేదు. మూగత్వంలో తలూపేడు.

"ఇంకెప్పుడూ నేను అనను. మీరుకూడా..." గునిసింది.

ఏమిటో ఆ ఉప్పునీళ్ళు తుడుస్తున్నప్పుడు భట్రాజులు చెరిగినట్టే కనిపించింది. ఆనందంలో ఒక్సారి హృదయం ఎగిరిపడింది.